సాక్షి
ఒడిశా

శనివారం । 16 । ఆగస్టు । 2025

ఘనంగా కృష్ణాష్టమి

మల్కన్‌గిరి : జిల్లా కేంద్రంలో ఉన్న సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో శుక్రవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకగా నిర్వహించారు. పిల్లలు వేషధారణల్లో ఆకట్టుకున్నారు. పూజలు చేసి అనంతరం జగన్నాథ స్వామి ఆలయానికి ర్యాలీగా వచ్చారు. బడి వద్ద ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు.



న్యూస్‌రీల్



నిశ్చలానందను కలిసిన మోహన్ భగవత్

భువనేశ్వర్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) ప్రముఖుడు మోహన్ భగవత్ రాష్ట్ర పర్యటనలో భాగంగా పూరీ గోవర్ధన పీఠాధిపతి స్వామి నిశ్చలానంద సరస్వతితో శుక్రవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వీరివురి మధ్య వివిధ మతపరమైన అంశాలపై చర్చ సాగినట్లు తెలిపారు.

11 జిల్లాలకు అదనంగా 5 కిలోల బియ్యం

భువనేశ్వర్: స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని గరీబ్ కల్యాణ్ అన్న యోజన రేషను కింద అదనంగా 5 కిలోల బియ్యం ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ప్రకటించారు. 3 నెలల పాటు నిరవధికంగా ఈ బియ్యం పంపిణీ చేస్తారు. 11 జిల్లాలకు ఈ సౌలభ్యం పరిమితంగా పేర్కొన్నారు. బౌద్, గజపతి, కంధమల్ జిల్లాలతో పాటు 8 కేబీకే జిల్లాలు ఈ సౌకర్యాన్ని పొందుతాయి. 27 లక్షలకు పైగా కుటుంబాలు 3 నెలల పాటు ఈ లబ్ధి పొందుతాయి. సమగ్రంగా 41 వేల 82 మెట్రిక్ టన్నుల అదనపు బియ్యం పంపిణీ చేస్తారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం తన సొంత నిధుల నుంచి దాదాపు రూ.180 కోట్లు ఖర్చు చేస్తుంది.

యువకుడిపై దాడి


దాడిలో గాయపడిన అగ్రవాల్

రాయగడ: స్థానిక ఎఫ్‌సీఐ కూడలి సమీపంలో ఫాస్ట్ ఫుడ్ వ్యాపారం చేసుకుని జీవనోపాధి పొందుతున్న ఒక యువకుడిపై గుర్తు తెలియని వ్యక్తి గొడ్డలితో దాడిచేసి గాయపరిచాడు. ఈ ఘటనలో గాయపడిన వ్యక్తి స్థానికంగా నివసిస్తున్న ప్రమోద్ అగ్రవాల్‌గా గుర్తించారు. ఈ మేరకు తనపై దాడి జరిగిందని బాధితుడు సదరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి దర్యాప్తు ప్రారంభించారు. శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో అగ్రవాల్ ఎప్పటిలాగే ఫాస్ట్‌ఫుడ్ వ్యాపారం కోసం తన దుకాణం తెరిచి, సామాన్లు సర్దుతున్న సమయంలో వెనుక నుంచి వచ్చి ఒక వ్యక్తి గొడ్డలితో దాడి చేశాడు. ఈ క్రమంలో దాడి నుంచి కాపాడుకునే ప్రయత్నంలో యువకుడి చేతులకు గాయాలయ్యాయి. దాడి చేసిన అనంతరం దుండగుడు అక్కడి నుంచి పరారయ్యాడు. అయితే ఇదివరకు తన దుకాణానికి ఆ వ్యక్తి వచ్చి తనతో పలుమార్లు గొడవ పడుతుండేవాడని, దీనిపై తాను ఇదివరకు ఒకసారి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని వెల్లడించారు. అదే కక్షతో తనపై దాడి చేసి ఉంటాడని బాధితుడు అగ్రవాల్ పోలీసులకు చేసిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. అయితే తనపై దాడి చేసిన వ్యక్తి వివరాలు తనకు తెలియదని వివరించాడు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం అగ్రవాల్ ఇంటికి వెళ్లిపోయాడు.

బాలికలపై లైంగిక దాడి

• ఇద్దరు నిందితులు అరెస్టు

జయపురం: బాలికలను వివాహం చేసుకుంటామని నమ్మించి అత్యాచారం చేసిన వేర్వేరు ఘటనల్లో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు జయపురం సదర్ పోలీసు అధికారి ఆశ్రిత ఖల్కే వెల్లడించారు. ఇద్దరు నిందితుల్లో ఒకరు బొరిగుమ్మ పోలీసుస్టేషన్ పరిధి జయంతిగిరి గ్రామానికి చెందిన కార్తీక పొరజ, మరొకరు జయపురంలోని చెందిన బైరాగి మఠానికి చెందిన ఉద్బభొ ఖిలోగా తెలియజేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జయంతిగిరికి చెందిన కార్తీక పొరజ అదే గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలికను వివాహం చేసుకుంటానని నమ్మించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీంతో బాలిక గర్భం దాల్చింది. ఈ ఘటనపై గ్రామ పెద్దలు చర్చించి పరిష్కరించేందుకు ప్రయతి్నంచారు. అయితే సమస్య పరిష్కారమవ్వక పోవడంతో పాటు కార్తీక పొరజ కుటుంబ సభ్యులు భయపెట్టడంతో బాలిక, ఆమె తల్లిదండ్రులు జయపురం మహిళా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడు కార్తీక పొరజను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. అటువంటి సంఘటనే జయపురం సదర్ పోలీసుస్టేషన్ బైరాగిమఠం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఉద్బభొ ఖిలో అదే గ్రామానికి చెందిన 17 ఏళ్ల మైనర్ బాలికను ప్రేమ పేరుతో వంచించాడు. ఇప్పుడు అతడు మరో యువతిని వివాహం చేసుకునేందుకు సిద్ధమవుతున్న విషయం తెలిసిన మైనర్ బాలిక నిలదీసింది. దీంతో అతడు భయపెట్టాలని చూడడంతో జయపురం మహిళా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి అతడిని అరెస్టు చేసినట్లు ఆశ్రిత ఖల్కే వెల్లడించారు.

మువ్వన్నెల వెన్నెల


రాష్ట్ర స్థాయి స్వాతంత్ర్య దినోత్సవంలో జాతీయ పతాకం ఆవిష్కరించిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి


రాష్ట్ర స్థాయి స్వాతంత్ర దినోత్సవంలో పలు వర్గాల పరేడ్ ప్రదర్శన


చిన్నారితో ముఖ్యమంత్రి ముచ్చట

భువనేశ్వర్: రాష్ట్ర స్థాయి స్వాతంత్ర్య దినోత్సవాల్లో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి జాతీయ పతాకం ఆవిష్కరించారు. ఆయనతో ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహూజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జవాన్ల గౌరవ వందనం స్వీకరించారు. స్వాతంత్ర్య వేడుకలకు విచ్చేసిన బాలలు, సాధారణ ప్రజలతో ముఖ్యమంత్రి ప్రత్యక్షంగా కరచాలనం చేసి ముఖాముఖి మాట్లాడారు.


బాలలతో ముఖ్యమంత్రి కరచాలనం

అంధ బాలలతో..

భువనేశ్వర్: స్థానిక భీమ్ భోయ్ అంధుల పాఠశాల విద్యార్థులతో కలిసి ముఖ్యమంత్రి దంపతులు స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించారు. ముఖ్యమంత్రి అధికారిక నివాసం ప్రాంగణంలో కార్యక్రమం జరిగింది. దేశ ఐక్యత, సమగ్రత, పురోగతి కోసం కలిసికట్టుగా సంకల్పించుకుందాం అని ముఖ్యమంత్రి బాలల్ని ఉద్దేశించి ప్రసంగించారు.


భీమ్ భోయ్ అంధుల పాఠశాల విద్యార్థులకు మిఠాయిలు పంచి పెడుతున్న ముఖ్యమంత్రి దంపతులు


రాష్ట్ర స్థాయి స్వాతంత్ర్య దినోత్సవంలో బ్లాక్ కమాండోల ప్రదర్శన

పర్లాకిమిడిలో..

పర్లాకిమిడి: స్థానిక గజపతి స్టేడియంలో స్వాతంత్ర్య వేడుకలకు రాష్ట్ర ఖనిజ, వ్యాపార, రవాణా శాఖ మంత్రి బిభూతీ జెన్నా ముఖ్యఅతిథిగా విచ్చేసి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. 26 ఎన్‌సీసీ పోలీసు ఆర్మ్‌డ్ ఫోర్సు, వివిధ పాఠశాలల బాయ్స్, గర్ల్స్ స్కౌట్స్ దళాలు కవాతు నిర్వహించాయి. కేంద్రం ఒడిశాలో త్వరలో సెమీ కండక్టర్ పరిశ్రమ నెలకొల్పనుందని మంత్రి తెలిపారు. ఆయనతో కలెక్టర్ మధుమిత, ఎస్పీ జ్యోతింద్ర పండా, డి.ఎఫ్.ఓ. కె.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


గజపతి స్టేడియంలో గౌరవ వందనం స్వీకరిస్తున్న రాష్ట్ర మంత్రి బిభూతీ జెన్నా, కలెక్టర్, ఎస్పీ


మల్కన్‌గిరి : గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ సోమేశ్ ఉపాధ్యాయ్


కొరాపుట్: నబరంగ్‌పూర్‌లో పారిశుద్ధ్య కార్మికులకు అవార్డు అందజేస్తున్న మంత్రి గణేష్ రామ్ సింగ్ కుంటీయా, ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి


కొరాపుట్: కొరాపుట్‌లో ప్రసంగిస్తున్న కలెక్టర్ మనోజ్ మహాజన్

మల్కన్‌గిరిలో..

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా డీఎన్‌కే క్రీడా మైదానంలో శుక్రవారం పంద్రాగస్టు వేడుకలు నిర్వహించారు. కలెక్టర్ సోమేశ్ ఉపాధ్యాయ్ జాతీయ జెండాను ఎగురవేశారు. యువత తమ శక్తిని దేశం కోసం ఉపయోగించాలని తెలిపారు. సింధ్రిమాల కేజీబీవీ బాలిక విభూతి ముండగుడియాను సత్కరించారు.


ఎన్‌సీసీ క్యాడెట్ల కవాతు


మల్కన్‌గిరి : విద్యార్థిని విభూతి ముదాగుడియాను సత్కరిస్తున్న కలెక్టర్

కొరాపుట్‌లో..

కొరాపుట్: కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో పంద్రాగస్టు వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో రాష్ట్ర అటవీ శాఖ మంత్రి గణేష్ రాం సింగ్ కుంటీయా జెండా ఎగురవేశారు. కొరాపుట్ జిల్లా కేంద్రంలో కలెక్టర్ మనోజ్ మహాజన్ జెండా ఎగుర వేశారు.

జయపురంలో..

జయపురం: జయపురం పట్టణంలో వానలోనే పంద్రాగస్టు వేడుకలు నిర్వహించారు. జయపురం సబ్ కలెక్టర్ అక్కవరం శౌశ్య రెడ్డి త్రివర్ణ పతాకాన్ని ఎగుర వేశారు.


జయపురం: జాతీయ పతాకాన్ని ఎగుర వేసిన సబ్‌క కలెక్టర శౌశ్యా రెడ్డి

• భారత మాతా కీ జై..



స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పూరీ సాగర తీరంలో రూపుదిద్దుకున్న సైకత శిల్పం ఆపరేషన్ సిందూర్‌ను ప్రతిబింబిస్తుంది. సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ ఈ కళాఖండాన్ని తీర్చిదిద్దారు. ప్రగతిశీల, సాధికారత, ఐక్య భారత దేశం స్ఫూర్తితో ఈ ఉత్సవం జరుపుకోవాలని అతడు పిలుపునిచ్చాడు. – భువనేశ్వర్/పూరీ


స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్థానిక 'ఉత్కళ బిపన్న సహాయత సమితి, ఒడిశా నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఆర్‌ఎస్ఎస్ చీఫ్ డాక్టర్ మోహన్ భగవత్ జాతీయ పతాకం ఆవిష్కరించారు. - భువనేశ్వర్

శ్రీ క్షేత్రంలో రెపరెపలాడిన మువ్వన్నెల పతాకం

పూరీ శ్రీ మందిరం సింహ ద్వారం ఆవరణలో మువ్వన్నెల జాతీయ పతాకం రెపరెపలాడింది. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని ఈ ఆవరణలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. – భువనేశ్వర్



ఆదర్శవంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నాం

• మంత్రి గోకులానంద మల్లిక్

రాయగడ: రాష్ట్రాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి గోకులానంద మల్లిక్ అన్నారు. స్థానిక గోవింద చంద్ర దేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలుగా ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న ఖనిజ, ప్రాకృతిక సంపదలను సద్వినియోగపరచాలన్నారు. దాదాపు 80 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని, వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసి రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతకుముందు పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో కలెక్టర్ అశుతోష్ కులకర్ణి, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న మంత్రి గోకులానంద మల్లిక్, పక్కనే ఎస్పీ స్వాతి, కలెక్టర్ అశుతోష్

ఆదివాసీలకు ఆశాదీపం

స్థానిక రైతుల కాలనీలోని నవజీవన్ ట్రస్ట్‌లో స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమానికి మాజీ మంత్రి లాల్ బిహారి హిమిరిక ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎంతోమంది నిరుపేదలైన అనాథ, ఆదివాసీ యువతులకు ఉచితంగా భోజన, వసతి సౌకర్యాలను కల్పిస్తూ ట్రస్టు ఆశాదీపంగా మారిందని పేర్కొన్నారు. అనంతరం అందరికీ మిఠాయిలు పంపిణీ చేశారు.


విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

• జన్మాష్టమి శుభాకాంక్షలు



శ్రీ కృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ పూరీ సాగర తీరంలో శ్రీ కృష్ణుని సైకత శిల్పంతో శుభాకాంక్షలు తెలియజేశారు. పర్యాటకులు సైకత శిల్పాన్ని ఆసక్తిగా తిలకించారు. – భువనేశ్వర్/పూరీ

• దళిత బాలల వేడుక



స్థానిక కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (కిస్) ప్రాంగణంలో దళిత బాలబాలికలు చిరునవ్వులు చిందిస్తూ సగర్వంగా స్వాతంత్ర్య వేడుకులు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కిస్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టరు అచ్యుత్ సామంత్ పాల్గొని బాలల్ని ప్రోత్సహించారు. – భువనేశ్వర్

20న జాతీయ ఓబీసీ కమిషన్ రాష్ట్ర పర్యటన

భువనేశ్వర్: జాతీయ వెనుక బడిన తరగతుల కమిషన్ (ఓబీసీ) అధ్యక్షుడు హన్సరాజ్ గంగారామ్ అహిర్ రాష్ట్ర పర్యటనకు రానున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఈ నెల 20న భువనేశ్వర్‌లో ఓబీసీ వర్గాల ఫిర్యాదులపై విచారణ చేపడతారు. ప్రధానంగా కేంద్ర ఓబీసీ జాబితాలో కొత్త వర్గాల్ని చేర్చడంపై విచారణ జరుగుతుంది. ఈ జాబితా సవరణ పురస్కరించుకుని మార్పు చేర్పులతో మినహాయింపుల్ని పరిశీలిస్తారు. ఈ నేపథ్యంలో ఆయన రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శికి లేఖ రాశారు.


హన్సరాజ్ గంగారామ్ అహిర్

క్లుప్తంగా

తప్పిన పెను ప్రమాదం



రహదారి పక్కనే ఒరిగిన స్కూల్ ఆటో

పొందూరు : మండల కేంద్రంలోని పొందూరులో మానసవేణి పాఠశాల విద్యార్థులను తీసుకెళ్తున్న ఆటో శుక్రవారం ప్రమాదానికి గురైంది. 20 మందికి పైగా విద్యార్థులను ఎక్కించడంతో ఒరిగిపోయిందని స్థానికులు చెబుతున్నారు. బోల్తా కొట్టుంటే పెద్ద ప్రమాదమే జరిగి ఉండేదని అంటున్నారు.

పుస్తెలతాడు చోరీ

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం నరసాపురం జంక్షన్ వద్ద గురువారం సాయంత్రం ఓ మహిళ మెడలో పుస్తెలతాడును దుండగులు తెంచుకుపోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంతబొమ్మాళి మండలం బడేకుప్పన్నపేటకు చెందిన బొమ్మాళి దాలమ్మ కోటబొమ్మాళిలో బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి నడుచుకుంటూ వస్తుండగా గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమె మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు పుస్తెలతాడు తెంచుకుని పరారయ్యారు. బాధితురాలు కోటబొమ్మాళి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

20 కేజీల గంజాయి స్వాధీనం



పట్టుబడిన నిందితులతో పోలీసులు

పలాస: ఒడిశాకు చెందిన నలుగురు గంజాయి అక్రమ రవాణాదారులను పలాస రైల్వే స్టేషన్‌లో అరెస్టు చేసినట్టు కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ శుక్రవారం తెలిపారు. నిందితులు మోహనా బ్లాక్ పడొవ గ్రామానికి చెందిన అనిసెంటు నాయక్ , రాహిత్ బిర, జునైలు, గుమ్మా గ్రామానికి చెందిన సురుసింగ్‌గా గుర్తించామని, వీరి వద్ద 20 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని వివరించారు. వీరిని అరెస్టు చేసి పలాస కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించడంతో జైలుకు పంపించామన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి



మృతుడు దుర్యోధన

పలాస: మోదుగులపుట్టి వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ శుక్రవారం చెప్పారు. నందిగాం మండలం జడ్యాడ గ్రామానికి చెందిన కంబకాయల దుర్యోధన టెక్కలిపట్నం బజారుకు వెళ్లి తిరిగి వస్తుండగా మోదుగులపుట్టి వద్ద వెనుక నుంచి వచ్చిన బైక్ బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో బలమైన గాయాలు కావడంతో కాశీబుగ్గలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా మృతి చెందాడు. దుర్యోధన కుమారుడు ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

పొందూరు: సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సత్యనారాయణ సూచించారు. మండలంలోని వావిలపల్లిపేట కూడలికి సమీపంలో ఉన్న ఒక ప్రైవేటు స్కూల్‌లో శక్తి యాప్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. వ్యక్తిగత ఖాతాల నుంచి నగదు డెబిట్ అయినట్లయితే వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే బాల్య వివాహాలు జరగకుండా రక్షణ కల్పించేందుకు 1098 ఫోన్ చేయాలన్నారు. ఆపదలో ఉన్నప్పుడు మహిళలు శక్తి యాప్‌ను వినియోగించుకొని రక్షణ పొందాలని సూచించారు. మాస్కులు ధరించి వాహనాలు నడిపిన వారిపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పీవీవీ శేషుకుమార్, హెచ్ఎం నీలిమ తదితరులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణలో వివక్షత

సరుబుజ్జిలి: సరుబుజ్జిలి జంక్షన్‌లో నాలుగువైపులా రహదారుల విస్తరణలో అధికారులు వివక్షత ప్రదర్శిస్తున్నారని పలువురు వాపోతున్నారు. కొలతలు వేసే సమయంలో రహదారి మధ్య భాగం నుంచి రెండువైపులా సమానంగా మార్కింగ్ చేయాలి. కానీ అలా కాకుండా కొంతమంది నేతల ఒత్తిళ్ల మేరకు ఒక్కోచోట ఒక్కోవిధంగా సంబంధిత యంత్రాంగాలు భూమిని మార్కింగ్ చేస్తున్నాయని తెలిపారు. దీనివలన విలువైన జిరాయితీ భూములను కోల్పోవాల్సిన పరిస్థితులు ఉన్నాయని వాపోతున్నారు. అధికారులు రహదారి విస్తరణ సమయంలో సమన్యాయంతో వ్యవహరించాలని కోరుతున్నారు.

రాజ్‌భవన్‌లో ఎట్ హోమ్



గిరిజన సంప్రదాయ ప్రముఖులతో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి మాటామంతి



ఎట్ హోమ్ కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ దంపతులు, ముఖ్యమంత్రి దంపతులు, స్పీకర్

భువనేశ్వర్: 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాజ్ భవన్‌లో ఎట్ హోమ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విశిష్ట వ్యక్తులతో గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి దంపతులు ఆప్యాయంగా ముచ్చటించారు. కార్యక్రమానికి ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి దంపతులు, శాసన సభ స్పీకర్ సురమా పాఢి ప్రధాన అతిథులుగా హాజరు అయ్యారు.



గిరిజన సంప్రదాయ ప్రముఖులతో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి మాటామంతి

మొబైల్ నేత్రాలయ వాహనం ప్రారంభం



విజన్ ఆన్ వీల్స్' మొబైల్ నేత్రలయాన్ని ప్రారంభిస్తున్న రవాణా శాఖ మంత్రి బిభూతీ జెనా



జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బిభూతి జెనా

పర్లాకిమిడి: రాష్ట్ర ఖనిజ, వ్యాపార, రవాణాశాఖ మంత్రి బిభూతీ జెనా దేశాయి ఫౌండేషన్ ట్రస్టు ఏర్పాటు చేసిన విజన్ ఆన్ వీల్స్ అనే క్యాటరేట్, అంధులకు ఉపయోగపడే మొబైల్ వాహనాన్ని శుక్రవారం ప్రారంభించారు. సకల సౌకర్యాలు కలిగిన ఈ సంచార నేత్ర పరీక్ష మొబైల్ వ్యాన్ ద్వారా గజపతి జిల్లాలోని రాయఘడ, ఆర్.ఉదయగిరి సమితులలో 102 గ్రామీణ ప్రాంతాలలో అంధులకు, స్క్రీనింగ్ చేసి తదనంతరం ఆపరేషన్లకు శ్రీకాకుళం జిల్లా రాగోలు జెమ్స్ ఆస్పత్రికి పేషెంట్లను తరలించనున్నట్టు దేశాయి ఫౌండేషన్ ప్రోగ్రాం మ్యానేజరు ప్రణవ్ ప్రతాప్ సింగ్ తెలియజేశారు. గజపతి జిల్లాలో ఈ విజన్ ఆన్ వీల్స్‌ను సి.సి.డి.స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి అడ్డాల జగన్నాథరాజు తీసుకువచ్చారు.



విజేతలతో కరచాలనం చేస్తున్న కలెక్టర్ సోమేష్ కుమార్

స్నేహపూర్వక ఫుట్‌బాల్ మ్యాచ్

మల్కన్‌గిరి: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో జిల్లా అధికార యంత్రాంగం, పోలీసు యంత్రాంగం మధ్య స్నేహపూర్వక ఫుట్‌బాల్ మ్యాచ్ జిల్లా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శుక్రవారం నిర్వహించారు. అధికారుల టీమ్‌కు కలెక్టర్ సోమేశ్ కుమార్ ఉపాధ్యాయ్, పోలీసుల టీమ్‌కు ఎస్పీ వినోద్ కుమార్ పటేల్‌లు కెప్టెన్లుగా వ్యవహరించారు. ఈ మ్యాచ్‌లో ఎస్పీ జట్టు విజయం సాధించింది.

మొక్కలు నాటివేత

పర్లాకిమిడి: ఆర్.సీతాపురం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. వర్సిటీ రిజిస్ట్రారు డాక్టర్ అనితా పాత్ర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి జాతీయ జెండాను ఎగురవేశారు. తదనంతరం యువజన రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఏక్ పేడ్ కా దేష్‌కే నాం పేరిట క్యాంపస్‌లో మొక్కలను విద్యార్థులు నాటారు. యూనిట్ రెడ్ క్రాస్ అధికారి డాక్టర్ సుశాంత కుమార్ పట్నాయక్, ఆర్.సి.రితీష్ కుమార్ పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న దృశ్యం



విద్యార్థులకు బహుమతి ప్రదానం

భక్తిశ్రద్ధలతో శ్రావణ పూజలు



కుంకుమ పూజల్లో మహిళలు

రాయగడ: స్థానిక బాలాజీనగర్‌లోని కళ్యాణ వేంకటేశ్వర మందిరంలో శ్రావణమాసం శుక్రవారం సందర్భంగా మందిరం ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు రాంజీ ఆచార్యుల ఆధ్వర్యంలో ఉదయం స్వామి వారికి సుప్రభాత, అభిషేక పూజలతోపాటు శ్రీరాజ్యలక్ష్మీదేవి సామూహిక కుంకుమార్చన పూజలను నిర్వహించారు. అధికసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

సెలవు రోజు తనిఖీలకు రావడమేంటి..?



విద్యార్థినులతో మాట్లాడుతున్న అధికారులు

- అధికారులను అడ్డుకున్న హాస్టల్ వార్డెన్

పాతపట్నం: స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లా పక్కనున్న ప్రభుత్వ ఎస్సీ బాలికల వసతి గృహాన్ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాల మేరకు తనిఖీ చేసేందుకు మండల అధికారులు శుక్రవారం సాయంత్రం వెళ్లారు. అయితే హాస్టల్ గేటుకు వేసిన తాళం తీయకుండా వార్డెన్ బి.శ్యామల అధికారులైన తహసీల్దార్ ఎన్.ప్రసాదరావు, ఎంపీడీవో పి.చంద్రకుమారి, ఏఎస్‌డబ్ల్యూవో ఎం.శ్యామలను బయటనే ఉంచారు. సెలవు రోజుల్లో హాస్టల్‌కు రావడమేంటని ఎదురు ప్రశ్నలు వేశారు. దీంతో వెంటనే తహసీల్దార్ ప్రసాదరావు ఎస్ఐ బి.లావణ్యకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఎస్ఐ తన సిబ్బందితో హాస్టల్‌కు చేరుకుని తాళం తీయించారు.

వార్డెన్ వేధిస్తున్నారు

ఈ హాస్టల్‌లో 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న మొత్తం 44 మంది విద్యార్థినులు ఉన్నారు. దీంతో వీరి వద్దకు అధికారులు వెళ్లి మాట్లాడారు. అయితే వార్డెన్ తమను వేధిస్తోందని విద్యార్థినులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. తరుచూ కొడుతోందని, సక్రమంగా భోజనం పెట్టడం లేదని వాపోయారు. ఏమైనా ప్రశ్నిస్తే తమ తల్లిదండ్రులకు తమపై లేనిపోని చాడీలు చెబుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే వారానికి ఒకటి లేదా రెండు రోజులు మాత్రమే హాస్టల్‌కు వస్తుందని పేర్కొన్నారు. వచ్చిన రోజుల్లో వేధిస్తుందని తెలిపారు. మెనూ సక్రమంగా పెట్టడం లేదని, పెట్టిందే తినాలని చెబుతుందని ఆరోపించారు. కాగా కలెక్టర్‌కు సాంఘిక సంక్షేమ జిల్లా అధికారులు ఫిర్యాదు చేయడంతో ఆయన ఆదేశాల మేరకు తనిఖీ చేయడానికి వచ్చామని తహసీల్దార్ తెలిపారు. విద్యార్థుల సమస్యలను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు ముందరి భాగం

మెళియాపుట్టి: మండలంలోని పెద్ద లక్ష్మీపురం గ్రామం వద్ద ఒక కారు అదుపుతప్పి కరెంట్ స్తంభానికి ఢీకొంది. వివరాల్లోకి వెళ్తే.. పలాస నుంచి చాపర గ్రామానికి దంత వైద్యుడు ఎస్.హరిప్రసాద్ ప్రతిరోజూ వస్తుంటారు. ఆయన ఎప్పటిలాగే గురువారం ఒడిశాలోని గారబంద మీదుగా వస్తుండగా, ఒక్కసారిగా కుక్క అడ్డంగా రావడంతో రహదారి పక్కనే ఉన్న కరెంటు స్తంభానికి ఢీకొని కారు ఆగిపోయింది. అయితే ఎయిర్ బెలూన్స్ తెరుచుకోవడంతో ప్రాణాలతో బయటపడినట్లు వైద్యుడు హరిప్రసాద్ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

జలుమూరు: దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీముఖలింగం ప్రధాన ఆలయంలో వారాహి అమ్మవారికి శ్రావణ మాసం నాలుగో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతి పూజతో ప్రారంభించి, అమ్మవారికి అర్చనలు, దర్శనాలు, ఏకవార అభిషేకాలు, కుంకుమ పూజలు చేపట్టారు. అమ్మవారికి నూతన వస్త్రాలు, పిండి వంటలు సమర్పించి మొక్కులు తీర్చారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మట్టి చరియలు పడి బాలుని మృతి



నది ఒడ్డున ధర్మ మృతదేహం

రాయగడ: నాగావళి నదిలో స్నానం చేస్తున్న సమయంలో పై నుంచి మట్టి చరియలు జారి పడడంతో ఆరేళ్ల బాలుడు మృతి చెందాడు. జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి పొలమ పంచాయతీ పరిధిలోని పొంగాలి గ్రామంలో శుక్రవారం ఈ విషాదం జరిగింది. మృతుడు అదే గ్రామానికి చెందిన శంకరరావు హికక కొడుకు ధర్మ హికకగా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కల్యాణ సింగుపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పంద్రాగస్టు వేడుకలను తిలకించేందుకు పొంగాలి గ్రామానికి చెందిన నలుగురు బాలురు గ్రామంలో గల పాఠశాలకు వెళ్లి తిరిగి వస్తూ.. గ్రామానికి సమీపంలో గల నాగావళి నదిలో స్నానం చేసేందుకు వెళ్లారు. ధర్మ అనే బాలుడు స్నానం చేసి వస్తున్న సమయంలో నది ఒడ్డున గల మట్టి చరియలు అతనిపై పడటంతో ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందాడు. విషయాన్ని తోటి బాలురు గ్రామస్తులకు తెలియజేయడంతో అంతా అక్కడికి వెళ్లి మట్టి చరియలని తొలగించారు. అయితే అప్పటికే ధర్మ మృతి చెందినట్లు గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు.



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఆందోళనలో అన్నదాత

- వర్షాలు లేక ఎండిపోతున్న పొలాలు
- పంటలు బతికించుకునేందుకు రైతులకు తప్పని పాట్లు



జి.సిగడాం : వర్షాలు సకాలంలో అనుకూలించకపోవడంతో మెట్టు ప్రాంత రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వరితో పాటు గోగు, మొక్కజొన్న, వేరుశనగ పంటలు ఎండిపోతుండటంతో వాటిని బతికించుకునేందుకు వ్యయప్రయాసలకు గురవుతున్నారు. వేలాది రూపాయలు మదుపులు పెట్టి పంటలు వేసినా వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో అవస్థలు తప్పడం లేదు. ఆగస్టు నెల సగం పూర్తయినా వరుణుడి కరుణ లేకపోవడంతో అయోమయానికి గురవుతున్నారు. జి.సిగడాం, జగన్నాథవలస, వెంకయ్యపేట చెట్టుపొదిలాం, ఎస్‌పీఆర్‌పురం, జాడ, డీఆర్ వలస, ముషినివలస, మద్రివలస, జి.సిగడాం తదితర ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా మారింది. సుదూర ప్రాంతాల నుంచి పైపులైన్లు పెట్టి పంటకు తడిపెట్టాల్సిన దుస్థితి దాపురించింది.

బీడుభూములుగా..



వర్షాల జాడలేక పంటపొలాలు బీడు భూములుగా మారుతున్నాయి. మరో 10 రోజుల్లో నాట్లు జరగకపోతే వరినారును పశువుల మేతగా వదిలేస్తాం. ప్రస్తుతం సుదూర ప్రాంతాల నుంచి నీరు తెచ్చి నారును బతికిస్తున్నాం.

– టి.అప్పారావు, రైతు, జాడ గ్రామం

చినుకు లేదు



మూడు వారాలుగా వాన జాడే లేదు. రైతులంతా దూర ప్రాంతాల నుంచి నీరు తెచ్చుకుని నారును బతికించుకుంటున్నాం. చెరువుల్లోనూ చుక్క నీరు లేదు. ఇలాగే కొనసాగితే ఈ ఏడాది వరి సాగు కష్టమే.

– ఎం.చిరంజీవి, రైతు, జాడ గ్రామం



జాడ గ్రామంలో తాగునీరు తెచ్చి వరినారును బతికించుకుంటున్న రైతు

అల్లూరి ఆశయసాధనకు కృషి



అల్లూరి విగ్రహానికి పూలమాల వేస్తున్న సర్పంచ్

జి.సిగడాం: విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు ఆశయ సాధనకు అంకితభావంతో కృషి చేయాలని సంతవురిటి పంచాయతీ సర్పంచ్ బుడారి లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం గ్రామంలోని అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ చందనాల గణపతి, మాజీ ఎంపీపీ బాలబొమ్మ వెంకటేష్, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, ఎంఎంఎస్ అధ్యక్షురాలు శిర్రా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎందరో సమరయోధుల త్యాగఫలం స్వాతంత్య్రం

• ఏపీఎస్పీ కమాండెంట్ మలికా గార్గ్



చింతలవలస ఐదవ ఏపీఎస్పీ బెటాలియన్‌లో జాతీయ జెండాకు వందనం చేస్తున్న కమాండెంట్ మలికాగార్గ్, అధికారులు, సిబ్బంది

డెంకాడ: ఎందరో సమరయోధుల త్యాగఫలం స్వాతంత్య్రమని చింతలవలస ఐదవ ఏపీఎస్పీ కమాండెంట్ మలికా గార్గ్ అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా చింతలవలస ఐదవ ఏపీఎస్పీ బెటాలియన్‌లో శుక్రవారం జాతీయ జెండాను కమాండెంట్ మలికా గార్గ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు వందల ఏళ్ల పాటు బ్రిటిష్ బానిసత్వం నుంచి భారతదేశం 1947 సంవత్సరం ఆగస్టు 15న విముక్తి పొందిందన్నారు. స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలను వృథా కానివ్వరాదన్నారు. ఉత్తమ సేవలు కనబరిచిన అధికారులు, సిబ్బందికి ప్రసంశా పత్రాలను అందేశారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు జి.లక్ష్మీనారాయణ, ఎస్.బాపూజీ, డీవీ రమణమూర్తి, అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

కొమరాడ: కొమరాడ మండలం విక్రంపురం గ్రామానికి చెందిన వుబ్బిశెట్టి చిట్టిబాబు(62) విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు ఎస్ఐ నీలకంఠం తెలిపారు. ఆయన చెప్పిన వివరాలు.. వుబ్బిశెట్టి చిట్టిబాబు తాపీ మేస్త్రిగా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం వర్షం కారణంగా పనిలేక వెళ్లలేదు. తన ఇంటి బయట విద్యుత్ వైర్ వేలాడుతుండగా ప్రమాదవశాత్తు తగిలి షాక్ గురై కుప్పకూలిపోయాడు. స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు వెల్లడించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

అనుమానాస్పదంగా ఎలక్ట్రీషియన్ మృతి



ఘటనా స్థలంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ సతీష్‌కుమార్

పెందుర్తి: భార్యతో గొడవల నేపథ్యంలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన పెందుర్తిలో చోటు చేసుకుంది. సీఐ కేవీ సతీష్‌కుమార్ తెలిపిన వివరాలు.. పెందుర్తి నటరాజ్ థియేటర్ సమీపంలోని నేల బావిలో ఓ వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు శుక్రవారం గుర్తించారు. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలికి చేరుకున్న సీఐ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలోని పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మృతుడు విజయనగరం జిల్లా జామి మండలం మామిడిపల్లికి చెందిన రావురు ప్రసాద్(25)గా గుర్తించినట్లు వెల్లడించారు. ప్రాథమిక సమాచారం మేరకు కొన్నాళ్లుగా భార్యతో వివాదాల కారణంగా తల్లితో స్వగ్రామంలో నివాసం ఉంటున్నాడని తెలిపారు. వృత్తి రీత్యా ఎలక్ట్రీషియన్ అయిన ప్రసాద్ మూడు రోజుల క్రితం పని మీద వెళుతున్నానని తల్లికి చెప్పి, తిరిగి ఇంటికి రాలేదన్నారు. ఈ క్రమంలో ప్రసాద్ ఆత్మహత్యకు పాల్పడ్డాడా? మరేదైనా కారణంతో మృతి చెందాడా? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

ఎక్సైజ్ అధికారులకు ప్రశంసాపత్రాలు



అమరావతిలో ప్రశంసాపత్రాలు అందుకున్న ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది

విజయనగరం టౌన్: ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది అమరావతిలో శుక్రవారం జరిగిన జెండాపండగలో రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ కమిషనర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను అందుకున్నారు. వారిలో విజయనగరం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ పైడి రామచంద్రరావు, సూపరింటెండెంట్ జీవన్ కిశోర్, రాజాం హౌస్ ఆఫీసర్ ఆర్.జై భీమ్, విజయనగరం ఎక్సైజ్ ఎస్ఐ సీహెచ్ రాజశ్రీ, నెల్లిమర్ల కానిస్టేబుల్ సీహెచ్.సంతోష్ పార్వతీపురం టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్ పి.పావని ఉన్నారు. వీరికి జిల్లాకు చెందిన అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

కొత్తవలసను ముంచెత్తిన వాన

• జలమయమైన రైల్వే అండర్ బ్రిడ్జీలు
• కొత్తవలస జంక్షన్ జలమయం



కొత్తవలస- విజయనగరం రోడ్డులో నిలిచిపోయిన వర్షపు నీరు

కొత్తవలస : మండలంలోని శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఇంత పెద్ద వర్షం గతంలో ఎన్నడు కురవలేదని స్థానికులు పేర్కొన్నారు. ఏకధాటిగా రెండు గంటలకు పైగా వర్షం కుండపోతగా కురవడంతో రైల్వే అండర్ బ్రిడ్జీలు, కొత్తవలస జంక్షన్ జలమయమమయ్యాయి. ముఖ్యంగా కొత్తవలస జంక్షన్ సమీపంలో నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జి పూర్తిగా వర్షం నీటితో నిండిపోయింది. ఈ వరద నీటిని అరికట్టేందుకు ఇటీవల సుమారు రూ 3.కోట్లతో నిర్మించిన పై కప్పు నిరుపయోగంగా మారింది. బ్రిడ్జి నీటితో నిండిపోవడంతో రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. అలాగే కొత్తవలస – విజయనగరం, కొత్తవలస – విశాఖపట్నం రోడ్డు పూర్తిగా వర్షం నీటితో నిండిపోయాయి. కొత్తవలస రైల్వే స్టేషన్‌ను సైతం వర్షం నీరు ముంచేసింది.



కొత్తవలస - విశాఖపట్నం జాతీయ రహదారిపై వర్షపు నీరు



కొత్తవలస రైల్వే అండర్ బ్రిడ్జి నీటితో నిండిపోవడంతో రాకపోకలకు అవకాశం లేకపోవడంతో నిలిచిపోయిన జనం



వర్షం నీటితో నిండిపోయిన కొత్తవలస రైల్వే బ్రిడ్జి

పైడితల్లికి అరటిపండ్లతో అలంకరణ

విజయనగరం టౌన్: శ్రావణమాసం నాలుగో శుక్రవారం సిరుల తల్లి, ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లి అమ్మవారిని వనంగుడిలో అరటిపండ్లతో అలంకరించారు. ఆలయ అర్చకుడు నేతేటి ప్రశాంత్, వేదపండితులు వెలువలపల్లి నరసింహమూర్తి ప్రత్యేక పూజలు చేశారు. పండ్లను నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

గాజుల అలంకరణలో విజయసాగర దుర్గ



శ్రావణమాసం నాలుగో శుక్రవారం సందర్భంగా విజయనగరం జిల్లా కేంద్రంలోని గూడ్స్‌షెడ్ రోడ్డులో కొలువై ఉన్న విజయసాగర దుర్గా మల్లీశ్వరి అమ్మవారిని భక్తులు గాజులతో అలంకరించారు. భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

– విజయనగరం టౌన్

బీసీ మహిళా నేతకు అవమానం!

• చైర్‌పర్సన్ లేకుండానే జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

సాక్షి, పార్వతీపురం మన్యం: ఓ వైపు మహిళోద్ధరణకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెబుతూనే.. స్త్రీ శక్తి పేరిట ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభమని అంటూనే.. స్వాతంత్ర దినోత్సవం రోజున ఓ మహిళా బీసీ నాయకురాలికి కూటమి నాయకులు తీవ్ర అవమానం కలిగించారు. పట్టణ ప్రథమ పౌరురాలైన పార్వతీపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి లేకుండానే జెండా ఆవిష్కరణ కార్యక్రమం నియోజకవర్గ ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర చేపట్టారు. పార్వతీపురం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం చేపట్టిన జెండా ఆవిష్కరణకు ఇన్‌చార్జి కమిషనర్ శ్రీనివాసరాజు ఆమెను పిలిచినట్లే పిలిచి అవమానించారనే వాదనలు వినిపిస్తున్నాయి. తొలుత ఉదయం 7.30 గంటల సమయానికి రావాలని ఒకసారి, మరలా తొమ్మిది గంటలకు రావాలని మరోసారి మున్సిపల్ చైర్‌పర్సన్ గౌరీశ్వరికి అధికారులు సమాచారం అందించారు. చెప్పిన ప్రకారం ఉదయం 9 గంటల సమయంలో ఆమె కార్యాలయానికి చేరుకున్నారు. ఎమ్మెల్యే రావాలంటూ.. జెండా ఆవిష్కరణ చేయకుండా సుమారు గంటకు పైగా ఆమెను వేచి ఉండేలా చేశారు. తర్వాత ఆమె లేని సమయంలో ఎమ్మెల్యేతో ఆవిష్కరణ చేయించారు. కమిషనర్ నిర్దేశించిన సమయానికి జెండా ఆవిష్కరణ చేయకుండా జాప్యం చేయడంతో చైర్ పర్సన్ గౌరీశ్వరి గంటన్నర పాటు నిరీక్షించి వెనుదిరిగారు. నిబంధనల ప్రకారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ జెండా ఆవిష్కరణ చేయాల్సి ఉంది. తనను పిలిచి అవమానించిన ఇన్‌చార్జి కమిషనర్ శ్రీనివాస రాజుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని చైర్‌పర్సన్ గౌరీశ్వరి తెలిపారు.



చైర్‌పర్సన్ లేకుండానే జెండా ఎగురువేస్తున్న ఎమ్మెల్యే

ప్రపంచ దేశాల్లో భారత్ అగ్రరాజ్యంగా ఎదగాలి



జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు, అధికారులు

• విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
• జిల్లా పరిషత్ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరణ

విజయనగరం: అనేక సవాళ్లను ఎదుర్కొంటూ అభివృద్ధి పథంలో ముందంజలో ఉన్న భారతదేశం ప్రపంచ దేశాల్లో అగ్రరాజ్యంగా ఎదగాలని ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆకాంక్షించారు. జెడ్పీ కార్యాలయంలో శుక్రవారం 79వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జాతీయ పతాకాన్ని ఎగురవేసి జెండా వందనం చేశారు. అనంతరం జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ వలసపాలకులను తరిమికొట్టి స్వాతంత్య్రసాధనలో సమరయోధుల స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనేక కులాలు, మతాలు, జాతులు, భాషలు, సంస్కృతులు కలిసి ఉన్న భారత దేశం ప్రపంచ దేశాల చూపును ఆకర్షించే స్థాయికి ఎదిగిందన్నారు. దేశ పౌరులంతా కలిసిమెలిసి అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. అనంతరం కారుణ్యనియామకాల్లో భాగంగా ముగ్గురు జూనియర్ అసిస్టెంట్‌లు, ఇద్దరు ఆఫీస్ అసిస్టెంట్‌లకు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు వర్రి నర్సింహమూర్తి, శాంతకుమారి, కెల్ల శ్రీనివాస రావు, జిల్లా పరిషత్ సీఈఓ బీవీవీ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

• శ్రావణ శోభ

ఆలయాల్లో శ్రావణ శోభ నెలకొంది. శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని వేకువజాము నుంచి ఆలయాలకు చేరుకున్న భక్తులు అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. విజయనగరం జిల్లా కేంద్రంలోని సంతోషిమాత మందిరంలో ఆలయ ప్రధానార్చకులు రమేష్ తివారీ నేతృత్వంలో అమ్మవారికి మహిళలు కుంకుమ పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలు చాటుకున్నారు. సాయంత్రం అమ్మవారికి గాజులతో ప్రత్యేకాలంకరణ చేయగా, మందిరమంతా వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా అమ్మవారికి మహిళలు దీపారాధనలు చేశారు. – విజయనగరం టౌన్



ప్రత్యేకాలంకరణలో సంతోషిమాత



పుష్పాలతో తీర్చిదిద్దిన అమ్మవారి చిత్రం, పాదాలు, త్రిశూలం



అమ్మవారికి దీపారాధనలు చేస్తున్న మహిళలు

ఉప్పొంగిన అడారుగెడ్డ

మక్కువ: వర్షాకాలం వచ్చిందంటే చాలు..ఆ ప్రాంత గిరిజనులు బిక్కుబిక్కుమంటూ అడారు గెడ్డలో రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి. కొందరు గెడ్డలో కొట్టుకుపోయి ప్రాణాలు సైతం విడుస్తున్నారు. స్థానికంగా భారీ వర్షాలు లేకపోవడంతో శుక్రవారం గెడ్డ గుండా గిరిజనులు రాకపోకలు సాగించారు. గుంటభద్ర గ్రామానికి చెందిన సుమారు 20 మంది గిరిజనులు పక్క గ్రామానికి వ్యవసాయ పనులు నిమిత్తం వెళ్లారు. పనులు ముగించుకుని తిరిగి గ్రామానికి చేరుకునే సమయంలో ఒడిశాలో కురుస్తున్న వర్షాలకు అడారుగెడ్డ ఒక్కసారిగా ఉప్పొంగింది. గిరిజనులు గెడ్డలో చిక్కుకున్నారు. వీరిని స్థానికులు గమనించి వెంటనే తాడు సాయంతో ఒడ్డుకు చేర్చారు. అలాగే, గుంటభద్రకు చెందిన కొండతామర మనోజ్ అనారోగ్యం భారిన పడడంతో గ్రామస్తులు కుర్చీలో గెడ్డ దాటించి దుగ్గేరు ఆస్పత్రికి తీసుకెళ్లారు. సాలూరు మండలం పొయ్యిమూల గ్రామానికి చెందిన ఓ గిరిజనుడు దుగ్గేరు గ్రామ సమీపంలోని అడారుగెడ్డను ద్విచక్ర వాహనంపై దాటుతుండగా గెడ్డ ఉధృతికి వాహనం కొట్టుకుపోయింది. గిరిజనుడు సురక్షితంగా బయటపడ్డాడు.



అడారుగెడ్డను దాటిస్తున్న తోటి గిరిజనులు

మండల సమాఖ్యకు జాతీయ స్థాయి అవార్డు

గంట్యాడ: గంట్యాడ మండల సమాఖ్యకు జాతీయ స్థాయి ఆత్మనిర్బర్ భారత్ సంఘటన్ అవార్డు వరించిన విషయం తెలిసిందే. ఈ మేరకు న్యూఢిల్లీలో కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పూస భవన్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆ శాఖ మంత్రి శివజార్ సింగ్ చౌహాన్ చేతుల మీదుగా సమాఖ్య అధ్యక్షురాలు కర్రి అనసూయమ్మ, కార్యదర్శి కంటిపాక సీతమ్మ, ఏపీఎంలు కోరుకొండ సులోచన దేవి, శ్రీనివాస్, ఏపీ సెర్ప్ అదనపు సీఈఓ ఆర్.శ్రీరాములునాయుడు అవార్డును అందుకున్నారు. అవార్డు కింద జ్ఞాపిక, సర్టిఫికెట్, రూ.3లక్షల చెక్కు ఇచ్చినట్టు సమాఖ్య సభ్యులు స్థానిక విలేకరులకు తెలిపారు.



కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న గంట్యాడ మండల సమాఖ్య అధ్యక్షురాలు, ఏపీఎం

మహిళల అభ్యున్నతి కోసమే స్త్రీశక్తి పథకం

విజయనగరం క్రైమ్: మహిళల అభ్యున్నతి కోసమే స్త్రీ శక్తి పథకం ప్రవేశపెట్టినట్టు రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మహిళల చదువు, ఉద్యోగం, స్వయం ఉపాధికి ఈ పథకం ఎంతగానో దోహదపడుతుందన్నారు. జిల్లాలో స్త్రీ శక్తి పథకాన్ని విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఎమ్మెల్యేలు అదితి, నాగమాధవితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్యేలతో పాటు పాలవలస యశస్వి, పడాల అరుణ బస్సులో కూర్చోగా ఉచిత టికెట్లను మంత్రి అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ అంబేడ్కర్ మాట్లాడుతూ జిల్లాలో రోజుకి సుమారు 12వేల మంది మహిళలకు ఉచిత బస్సు ప్రయోజనం కలుగుతుందన్నారు. విజయనగరం, ఎస్.కోట డిపోల పరిధిలో 160 బస్సులు ఉన్నాయని, వీటిలో 131 బస్సులను స్త్రీ శక్తి పథకానికి కేటాయించినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో రెడ్డి పావని, డ్వాక్రా మహిళలు సన్యాసమ్మ, పార్వతి మాట్లాడారు. డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున, డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, జిల్లా ప్రజారవాణా అధికారి జి.వరలక్ష్మి, ఆర్టీసీ ఎంఎం సత్యనారాయణ పాల్గొన్నారు. తొలిరోజు బస్సు ఎక్కేందుకు మహిళలు పోటీ పడడంతో పోలీసులు అదుపుచేయాల్సి వచ్చింది.



విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో తోసుకుంటూ బస్సు ఎక్కుతున్న మహిళలు

ఆర్థిక సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

వీరఘట్టం: ఆర్థిక సమస్యలతో కె. రామకృష్ణ తోటపల్లి డ్యామ్‌లో దూ కి ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్.ఐ జి.కళాధర్ శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు గ్రామానికి చెందిన రామకృష్ణ కొన్ని సంవత్సరాలుగా ఆర్థిక ఇబ్బందుల తో బాధ పడుతున్నాడు. వాటి నుంచి బయటపడలేక ఆత్మహత్య చేసుకున్నట్టు అతని భార్య సంతోషి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చెప్పారు. ఈ నెల 11న తోటపల్లి డ్యామ్‌లో దూకిన రామకృష్ణ శుక్రవారం ఉదయం తోటపల్లి ఎడమ కాలువలో ఒకటవ బ్రాంచ్‌లో కడకెల్ల సమీపంలో మృతదేహమై తేలాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చినట్టు తెలిపారు.

విశ్రాంత ఆర్మీ ఉద్యోగులకు ఘన సన్మానం



విశ్రాంత ఆర్మీ ఉద్యోగులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని ఒమ్మి ప్రాథమిక పాఠశాలలో విశ్రాంత ఆర్మీ ఉద్యోగులను శనివారం ఘనంగా సన్మానించారు. హెచ్ఎం అండలూరి సత్యానందం ఆధ్వర్యంలో ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ఐదుగురు జవాన్లు మజ్జి రామప్పుడు, రెడ్డి అప్పలనాయుడు, వల్లూరి రమణ, పాదిలాపు అప్పలనాయుడు, చందక శ్రీనును దుశ్శాలువలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. దేశ రక్షణ కోసం వారు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మజ్జి కంచినాయుడు, గ్రామ పెద్దలు అంబళ్ల అప్పలనాయుడు, దురగాశి ఎర్రంనాయుడు, మజ్జి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థంలో వైభవంగా శ్రావణమాస పూజలు

• గాజుల అలంకరణలో మహాలక్ష్మి అమ్మవారు

నెల్లిమర్ల రూరల్: శ్రావణమాసం నాలుగో శుక్రవారం రామతీర్థంలోని మహాలక్ష్మి అమ్మవారిని గాజులతో అర్చకులు సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పాలు, పెరుగు, తేనె, నెయ్యి, వివిధ రకాల ఫల రసాలు, గంధంతో పంచామృతాభిషేకాలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ క్షేత్ర పాలకుడైన శ్రీ ఉమా సదాశివాలయంలో కామాక్షి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో ఈఓ వై శ్రీనివాసరావు, అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు, మల్లికార్జునశర్మ, కిరణ్, పవన్, రామగోపాలాచార్యులు పాల్గొన్నారు.



గాజుల అలంకరణలో రామతీర్థం శ్రీమహాలక్ష్మి అమ్మవారు